


Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



శ్రీసత్యసాయి | సంపుటి: 03 | సంచిక : 50 | మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# నేపాల్‌లో జలవిలయం..

- 6 సెకన్లలో కళ్లముందే కుప్పకూలి నదిలో కలిసిపోయిన భారీ కొండ
- వరదలు, కొండచరియల వల్ల 24 మంది మృతి, పలువురు గల్లంతు
- హిమపాతంలో చిక్కుకుని మరో ఇద్దరు మృతి, 10 మంది గల్లంతు

నేపాల్ - సూర్య వాస్తవం

నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ముస్తాంగ్ జిల్లాలో ఒక భారీ పర్వత భాగం కొద్ది సెకన్ల వ్యవధిలోనే కుప్పకూలి నదిలో కలిసిపోయిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ భయానక దృశ్యాలు ఆ దేశంలో నెలకొన్న విపత్కర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ముస్తాంగ్ జిల్లాలోని లేటే సమీపంలో ఒక భారీ పర్వత భాగం కేవలం ఆరు సెకన్ల వ్యవధిలోనే కాళీ గండకి నదిలోకి జారిపడింది. చార్‌ధామ్ యాత్రికులు చిత్రీకరించిన ఈ వీడియోలో, కొండచరియలు వేగంగా కిందికి దూసుకురావడంతో స్థానికులు భయాందోళనలతో కేకలు వేయడం వినిపిస్తోంది. ఈ ఘటన కారణంగా నదీ ప్రవాహానికి తాత్కాలికంగా ఆటంకం ఏర్పడింది.

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న మరో వీడియోలో, కొండచరియలు విరిగిపడటంతో చెట్లతో పాటు ఒక ఇల్లు కూడా లోయలోకి కొట్టుకుపోయింది. 'ఘర్ గయా సక్యో (ఇల్లు పోయింది) అంటూ గ్రామస్థులు భయాందోళనలతో హాహాకారాలు చేయడం, ఒక మహిళ రోదిస్తున్న దృశ్యాలు



చూసేవారిని కలచివేస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదలు, కొండచరియల విరిగిపడిన ఘటనల్లో ఇప్పటివరకు 24 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది గల్లంతయ్యారు. ప్రతికూల వాతావరణం కారణంగా పలు జిల్లాల్లో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది.

మరోవైపు, మనాంగ్ జిల్లాలోని హిమ్లుంగ్ హిమాల్ బేస్ క్యాంప్ వద్ద సంభవించిన హిమపాతంలో ఇద్దరు మరణించగా, మరో 10 మంది ఆచూకి లభ్యం కాలేదు. నెల రోజుల క్రితం సంభవించిన భోటేకోశీ వరదల విషాదం నుంచి కోలుకోకముందే నేపాల్‌ను మరో విపత్తు చుట్టుముట్టడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.



## బీజేపీ నేతలకు ఓటర్లంటే భయం లేదు

- ఢిల్లీలో యువకుడిపై చేయి చేసుకున్న మంత్రి పర్వేశ్ వర్మ
- ఘటనపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ
- ఇదంతా అధికార అహంకారమేనని ఘాటు వ్యాఖ్యలు
- ఆయనకు విషయం తెలియదంటూ మంత్రి కౌంటర్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఢిల్లీలో ఓ యువకుడిపై బీజేపీ మంత్రి భౌతిక దాడికి దిగిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. అధికార మదంతో బీజేపీ నేతలు ప్రవర్తిస్తున్నారని, వారికి ఓటర్లంటే కనీస భయం లేదని ఆయన ధ్వజమెత్తారు.

వివరాల్లోకి వెళితే... ఢిల్లీ పీడబ్ల్యూడీ మంత్రి పర్వేశ్ వర్మ ఆదివారం తన నియోజకవర్గ పరిధిలోని తిలక్ నగర్‌లో రోడ్ల పనులను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ యువకుడు రహదారుల నిర్మాణంలోని లోపాలపై ప్రశ్నిస్తూ వీడియో తీయడం

- మిగతా 2లో..




## యూపీఐ ఛార్జీలు కట్టాల్సిందే..

- యూపీఐ ఛార్జీలపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు....
- రూ.2 వేలకు పైబడిన ఎంపిక చేసిన లావాదేవీలపై ఎండీఆర్.. స్టేకు నిరాకరణ.
- కేంద్రం, ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి నోటీసులు..
- అక్టోబర్ 15 నుంచి కొత్త విధానం
- వినియోగదారులకు నేరుగా ఛార్జీ లేదు
- చట్టబద్ధతపై కోర్టు వివరణ కోరింది

2లో



## నేడే స్టార్‌షిప్ చరిత్రాత్మక ప్రయోగం..

2లో

# అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించాలి

- సీఎం రేవంత్‌రెడ్డి.
- ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత ఉండాలి..
- ఓటర్ల సంఖ్య తగ్గుదలపై సీఎం ప్రశ్న
- ఓటర్ల జాబితాపై స్పష్టత అవసరం
- నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాలి
- తెలంగాణ అభివృద్ధికి కేంద్ర సహకారం అవసరం..
- విద్య, నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు పూర్తిగా పరిరక్షించబడేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. అసోం దినపత్రిక ప్రతిదిన్ మీడియా నెట్‌వర్క్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ది కాంక్లేవ్ 2026 లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్ అంశంపై జరిగిన చర్చలో దేశ భవిష్యత్ దిశతో పాటు తెలంగాణ అభివృద్ధి, విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతులు, నియోజకవర్గాల పునర్విభజన, ఎస్ఐఆర్ తదితర అంశాలపై

- మిగతా 2లో..



## అస్సాం సీఎం భయపడ్డారు

- సీజేపీ నేత అశుతోష్ రంకా
- గువాహటిలో సీజేపీ నేత అశుతోష్ రంకా సహా 40 మంది నిర్బంధం
- వాలంటీర్ల సమావేశానికి ముందే అడ్డుకున్న అస్సాం పోలీసులు
- విడుదలైన తర్వాత సీఎం హిమంతకు సవాల్ విసిరిన రంకా
- ఈశాన్య రాష్ట్రాల్లో ప్రచారం మరింత ఉద్ధృతం చేస్తామని ప్రకటన

అస్సాం- సూర్య వాస్తవం

అస్సాంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలకు, పోలీసులకు మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. పార్టీ సహ-వ్యవస్థాపకుడు

- మిగతా 2లో..

# 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం..

- మేనమామలా మారిన సీఎం విజయ్
- 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం
- మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం
- కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్



చెన్నై - సూర్య వాస్తవం

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సోమవారం మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు.

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# బంగాళాఖాతంలో మరో వాయుగుండం..

- కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి వర్షాల అంచనా
- గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం - రానున్న 72 గంటల్లో బంగ్లాదేశ్ వైపు తీరం దాటే సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

2లో





## ప్రతిభకు ప్రోత్సాహం..

2లో

# బీజేపీ నేతలకు ఓటర్లంటే భయం లేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించాడు. దీంతో ఆగ్రహానికి గురైన మంత్రి ఆ యువకుడి చెంపపై కొట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఉదంతంపై రాహుల్ గాంధీ మండిపడ్డారు. "ప్రజలు బహిరంగంగా ప్రశ్నిస్తే చెంపదెబ్బ, పేపర్ లీకేజీలపై నిలదీస్తే లాఠీఛార్జ్, పార్లమెంటులోగళమెత్తితే మైక్ ఆఫ్ చేయడం.. ఇవన్నీ అధికార అహంకారానికి నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు. ఓట్లు దొంగిలించి అధికారంలోకి వస్తున్నందునే, తప్పు చేస్తే ప్రజలు గద్దె దించుతారన్న భయం వారిలో లేకుండా పోయిందని రాహుల్ ఆరోపించారు. ఇలాంటి పార్టీలకు ప్రజల మద్దతుతో పనిలేదని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ విమర్శలపై మంత్రి పర్వేశ్ వర్మ స్పందించారు. ఈ విషయం గురించి రాహుల్‌కు కనీస అవగాహన లేదని, ఆయన ఇటువంటి అంశాలకు దూరంగా ఉంటేనే మంచిదని హితవు పలికారు.

# అస్సాం సీఎం భయపడ్డారు

(మొదటిపేజీ తరువాయి)

అశుతోష్ రంకా సహా సుమారు 40 మంది వాలంటీర్లను ఆదివారం గువాహటిలో అస్సాం పోలీసులు నిర్బంధించారు. వాలంటీర్ల సమావేశానికి ముందే ఈ ఘటన జరగడం గమనార్హం. కొన్ని గంటల తర్వాత విడుదలైన అనంతరం రంకా.. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు సవాల్ విసిరారు. "అస్సాంలో కాక్రోచ్‌ల పోరాటం ఇప్పుడే మొదలైంది" అని వ్యాఖ్యానించారు. సీజేపీ తమ తొలి ప్రాంతీయ వాలంటీర్ల సమావేశాన్ని గువాహటిలో నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, పోలీసులు సమావేశ వేదిక వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, నేతలు ఉన్న ప్రైవేట్ నివాసం నుంచి అశుతోష్ రంకా, అన్కిత్ భరద్వాజ్, ప్రేమాకాష్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఆరుగురు మహిళలు కూడా ఉన్నారు. అందరినీ కాహిలిపారాలోని 10వ అస్సాం పోలీస్ బెటాలియన్ క్యాంపస్‌కు తరలించారు. ఈ నిర్బంధాన్ని నిరసిస్తూ వారు నిరాహార దీక్ష ప్రారంభించారు. తమను కలిసేందుకు న్యాయవాదులను కూడా అనుమతించలేదని సీజేపీ ఆరోపించింది.

నిర్బంధ సమయంలో రంకా మాట్లాడుతూ.. పాఠశాలల దుస్థితి, కజిరంగాలో భూహక్కులు, మానవ తప్పిదాల వల్ల వస్తున్న వరదల వంటి అంశాలను తాము ప్రస్తావిస్తామనే భయంతోనే సీఎం హిమంత బిశ్వ శర్మ తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాము దేనికీ భయపడబోమని స్పష్టం చేశారు. సాయంత్రం అందరినీ విడుదల చేయడంతో నిర్బంధం ముగిసింది. ఈశాన్య రాష్ట్రాల్లో తమ ప్రచారాన్ని మరింత బలోపేతం చేస్తామని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని రంకా ప్రకటించారు.

# బంగాళాఖాతంలో మరో వాయుగుండం..

**- కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి వర్షాల అంచనా**
**- గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం**
**- రానున్న 72 గంటల్లో బంగ్లాదేశ్ వైపు తీరం దాటే సూచన**
**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక**

**అమరావతి- సూర్య వాస్తవం**

బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాయుగుండం కాం ణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది. మయన్మార్, అండమాన్ దీవుల సమీపంలో ఏర్పడిన ఈ వాయుగుండం, ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కు 580 కిలోమీటర్ల దూరంలో తూర్పు-ఈశాన్య దిశలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా బంగ్లాదేశ్ వైపు కదులుతోంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి, సుమారు 72 గంటల్లో బంగ్లాదేశ్ తీరాన్ని తాకవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ వాయుగుండం ప్రభావంతో ప్రభావిత ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవలే ఉత్తరాంధ్ర తీరంలో కళింగపట్నం వద్ద ఒక తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టం జరిగిన నేపథ్యంలో తాజా హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

# 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం..

(మొదటిపేజీ తరువాయి)

బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్ఛరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు.

అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

# యూపీఐ ఛార్జీలు కట్టాల్సిందే..

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ యూపీఐ ద్వారా రూ.2,000కు పైబడిన కొన్ని వ్యాపార లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ ఎండీఆర్ విధించే కొత్త విధానంపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. ప్రస్తుతానికి కొత్త ఎండీఆర్ విధానంపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, యూపీఐ స్టీరింగ్ కమిటీకి నోటీసులు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం అక్టోబర్ 15, 2026 నుంచి రూ.2,000కు పైబడిన నిర్దిష్ట పర్సన్-టు-మర్చంట్ ౡ2పీ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ అమల్లోకి రానుంది. అయితే ఈ మొత్తం సాధారణ వినియోగదారుడి నుంచి నేరుగా వసూలు చేసే ఛార్జీ కాదు. ఎండీఆర్‌ను వ్యాపారి చెల్లించాల్సి ఉంటుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు ఈ ఛార్జీ గరిష్ఠంగా రూ.300కు పరిమితం కానుంది. యూపీఐ వ్యవస్థలో చోటుచేసుకున్న ఈ మార్పుపై ఖాతాదారుల్లో నెలకొన్న సందేహాలను కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే పర్సన్-టు-పర్సన్ ౡ2పీ లావాదేవీలు ఎంత మొత్తమైనా ఉచితంగానే కొనసాగుతాయని తెలిపింది. అలాగే రూ.2,000 వరకు జరిగే వ్యాపారి లావాదేవీలు, జీరో-ఎండీఆర్ పరిధిలోని చిన్న వ్యాపారుల లావాదేవీలకు కూడా కొత్త ఛార్జీ వర్తించదు. కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం మొత్తం ౡ2వీ లావాదేవీల్లో సుమారు 96 శాతం ఈ కొత్త ఛార్జీ పరిధిలోకి రావు. ఎండీఆర్ ప్రభుత్వానికి పన్ను రూపంలో వెళ్లే మొత్తం కాదని, యూపీఐ చెల్లింపుల వ్యవస్థలో పాల్గొనే బ్యాంకులు, చెల్లింపు యాప్ సంస్థలు తదితర భాగస్వాముల మధ్య పంపిణీ అయ్యే రుసుమని కేంద్రం వివరించింది. సాధారణ వినియోగదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడానికి అదనపు ఛార్జీ చెల్లించాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేసింది. రూ.2,000కు పైబడిన యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఎండీఆర్ విధించే నిర్ణయాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది అంజన్ దత్తా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్లను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ ఛార్జీల వల్ల చివరకు వ్యాపారులు ఆ భారాన్ని వినియోగదారులపైకి మళ్లించే అవకాశం ఉందని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా ఈ వ్యవహారం కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా సాంకేతిక, చెల్లింపుల వ్యవస్థకు సంబంధించిన అంశంగానూ కనిపిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించినట్లు లైవ్‌లా నివేదించింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకటరామన్ వాదనలు వినిపిస్తూ యూపీఐ ఎండీఆర్ నుంచి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోదని కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం ఎండీఆర్ విధానంపై స్టే లభించనప్పటికీ, దీనికి సంబంధించిన చట్టపరమైన అంశాలు, విధానం, అమలు తీరుపై సంబంధిత సంస్థల నుంచి సుప్రీంకోర్టు వివరణ కోరింది. దీంతో అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్న కొత్త యూపీఐ ఎండీఆర్ విధానంపై తదుపరి విచారణలో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై స్పందించిన రేవంత్‌రెడ్డి.. దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్యలో తగ్గుదల ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, అర్హతల నిర్ధారణ వంటి ప్రక్రియలు స్పష్టంగా, ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉండాలని అన్నారు. ఓటు హక్కుకు సంబంధించి ఎలాంటి అనుమానాలకు తావులేకుండా సంబంధిత వ్యవస్థలు పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగుతున్నాయా అనే అంశంపై ప్రజలకు స్పష్టమైన సమాచారం ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏవైనా పేర్ల తొలగింపులు జరిగితే వాటికి సంబంధించిన కారణాలు, అభ్యంతరాల ప్రక్రియ, పునఃనమోదు అవకాశాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు హక్కు విషయంలో ప్రజల్లో విశ్వాసం మరింత బలోపేతం కావాలంటే ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత కీలకమని ఆయన అన్నారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో ఓటర్లు తమ పేర్లను పరిశీలించుకునేలా ఎన్నికల సేవా వ్యవస్థలు అందుబాటులో ఉన్న విషయం కూడా ఎన్నికల అధికారిక వేదికల్లో ఉంది. దేశ రాజకీయ వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి.. అర్హులైన పౌరుడి ఓటు హక్కు ఏ పరిస్థితుల్లోనూ దెబ్బతినకూడదని అన్నారు. ఓటర్ల జాబితా సవరణలో సాంకేతిక, పరిపాలనా ప్రక్రియలతో పాటు ప్రజలకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

తెలంగాణ అభివృద్ధి అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్రానికి సంబంధించిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి తగిన మద్దతు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులు వంటి ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, రవాణా సౌకర్యాల విస్తరణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఇప్పటికే ప్రస్తావనలో ఉన్న మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు వంటి అంశాలపై కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సహకారం కోరుతున్న విషయం గతంలోనూ ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశ అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఒక రాష్ట్రంలోని స్థానిక వనరులు, మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా కేంద్రం ప్రోత్సహించాలని సూచించారు. తెలంగాణకు అవసరమైన ప్రాజెక్టులకు తగిన సహకారం లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి.. జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో రాజకీయ ప్రాతినిధ్యపరంగా నష్టం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో నియోజకవర్గాల సంఖ్యను స్థిరీకరించిన నిర్ణయాలను ప్రస్తావిస్తూ, జనాభా నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించిన రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గితే జాతీయ విధానాల రూపకల్పనలో ఆ రాష్ట్రాల వాదన బలహీనపడే అవకాశం ఉందనే తన ఆందోళనను వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో అన్ని ప్రాంతాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని సమతుల్య విధానం అవలంబించాలని సూచించారు. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం గతంలోనూ ప్రాతినిధ్య సమతుల్యతను కాపాడే విధానంపై తన అభిప్రాయాన్ని వెల్లడించింది. తెలంగాణను విద్య, నైపుణ్యాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల ఆధారంగా అభివృద్ధి చేసి దేశ ప్రగతిలో రాష్ట్రాన్ని కీలక భాగస్వామిగా నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. యువతకు విద్యతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, నర్సరీ విద్య వంటి అంశాలపై వచ్చిన ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టామని అన్నారు. ప్రాంతీయ భాషపై పట్టు కొనసాగిస్తూనే ఇంగ్లీష్ భాషను కూడా నేర్చుకునేలా విద్యా వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల్లో భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, పాఠశాల విద్య అనంతరం ప్రత్యేక నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అన్నారు. యువత ఉద్యోగావకాశాలకు సిద్ధమయ్యేలా విద్య, శిక్షణ, నైపుణ్యాలను అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. తెలంగాణలో విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిని అనుసంధానించే కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. మొత్తంగా దేశ భవిష్యత్ అభివృద్ధిలో రాష్ట్రాలకు సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు పరిరక్షణ, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య సమతుల్యత, యువతకు విద్య--నైపుణ్యాల కల్పన వంటి అంశాలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించారు.

# నేడే స్టార్‌షిప్ చరిత్రాత్మక ప్రయోగం..

**- భారత్ మీదుగా భూమి చుట్టూ 6 సార్లు ప్రదక్షిణ!**
**- తొలిసారిగా కక్ష్యలోకి దూసుకెళ్లనున్న స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్**
**- భారతదేశం మీదుగా ప్రయాణించనున్న అంతరిక్ష నౌక**
**- భూమి చుట్టూ ఆరుసార్లు తిరిగి పసిఫిక్ మహాసముద్రంలో కూల్చివేత**
**- 26 శక్తిమంతమైన స్టార్‌లింక్ శాటిలైట్లను మోసుకెళ్తున్న నౌక**
**- చంద్రుడు, అంగారకుడి యాత్రల దిశగా ఇది కీలక ప్రయోగం**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ప్రపంచ ప్రఖ్యాత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'స్పేస్‌ఎక్స్' మరో చరిత్రాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. ఆ సంస్థ అభివృద్ధి చేసిన భారీ స్టార్‌షిప్ రాకెట్‌ను తొలిసారిగా కక్ష్యలోకి పంపనుంది. 'ఫ్లైట్ 14'గా వ్యవహరిస్తున్న ఈ ప్రయోగం ఈరోజు (సోమవారం, సెప్టెంబర్ 28) భారత కాలమానం ప్రకారం సాయంత్రం ప్రారంభం కానుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ ప్రయోగం నిర్ణీత సమయానికే జరగనుంది. ఈ ప్రయోగంలో భాగంగా స్టార్‌షిప్ భూమికి సుమారు 275 కిలోమీటర్ల ఎత్తులో ఆరుసార్లు పరిభ్రమించనుంది. ఈ ప్రయాణ క్రమంలో ఇది భారతదేశం మీదుగా కూడా వెళుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 10 గంటల పాటు సాగే ఈ యాత్ర ముగింపులో, స్టార్‌షిప్ చిలీకి పశ్చిమ దిశలో పసిఫిక్ మహాసముద్రంలో సురక్షితంగా ల్యాండ్ (స్ప్లాష్‌డౌన్) అవుతుంది. ఇప్పటివరకు జరిగిన ప్రయోగాలన్నీ సబ్-ఆర్బిటల్ స్థాయిలోనే సాగగా, పూర్తిస్థాయి కక్ష్యలోకి (ఆర్బిటల్) పంపిస్తున్న తొలి ప్రయోగం ఇదే కావడం విశేషం. ఈ మిషన్ కోసం స్పేస్‌ఎక్స్ పలు కీలక లక్ష్యాలను నిర్దేశించుకుంది. ప్రధానంగా 26 శక్తిమంతమైన స్టార్‌లింక్ ఎ3 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేరవేయనుంది. ఇవి ఇంటర్నెట్ సామర్థ్యాన్ని భారీగా పెంచనున్నాయి. అలాగే, మెరుగైన హీట్-షీల్డ్ టైల్స్ పనితీరును పరీక్షించడం, ప్రయోగం అనంతరం సూపర్ హెవీ బూస్టర్‌ను నియంత్రిత పద్ధతిలో మెక్సికో సింధుశాఖలో ల్యాండ్ చేయడం వంటివి కూడా ఈ లక్ష్యాల్లో ఉన్నాయి. భవిష్యత్తులో చంద్రుడు, అంగారక గ్రహాలపైకి మానవులను పంపేందుకు స్టార్‌షిప్‌ను పూర్తిస్థాయి పునర్వినియోగ రాకెట్‌గా మలచడంలో ఈ ప్రయోగం అత్యంత కీలకం కానుంది. స్పేస్‌ఎక్స్ ఈ చారిత్రక ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

# ప్రతిభకు ప్రోత్సాహం..

**- అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా**
**- మంత్రి లోకేశ్‌తో సమావేశమైన భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజయ్ రెడ్డి**
**- ఏపీలో అంధుల క్రికెట్‌ను బలోపేతం చేయడంపై కీలక చర్చ**
**- క్రీడాకారులకు పూర్తి మద్దతు ఇస్తామని లోకేశ్ భరోసా**
**- అంధ క్రికెటర్ల కోసం ప్రత్యేక మైదానాలు ఏర్పాటు చేస్తామని హామీ**
**- వారి ప్రతిభ, సంకల్పానికి అండగా నిలుస్తామన్న మంత్రి**

**అమరావతి - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. భారత అంధుల క్రికెట్ జట్టుకు మూడు ప్రపంచకప్‌లు అందించిన మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి సోమవారం మంత్రి లోకేశ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అంధుల క్రికెట్ ఎదుర్కొంటున్న సవాళ్లు, క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అజయ్ కుమార్ రెడ్డిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర, దేశ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు మద్దతుగా నిలవడం, ప్రత్యేకించి దృష్టి లోపం ఉన్న క్రికెటర్ల కోసం ప్రత్యేక క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి కీలక అంశాలపై చర్చించాం" అని లోకేశ్ తెలిపారు.

అంధ క్రీడాకారుల ప్రతిభ, అకుంఠిత దీక్ష, వారు సాధించిన విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. "వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. అజయ్ రెడ్డి వంటి క్రీడాకారులతో నేరుగా చర్చించి, ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు ప్రకటించడం పట్ల రాష్ట్రంలోని అంధ క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## సంపాదకీయం




# విద్యాసంస్థల్లో రాజకీయ కాలుష్యం

"విద్య ప్రాథమిక లక్ష్యం విజ్ఞానాన్ని అందించడం మాత్రమే కాదు; జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, ఒత్తిళ్లను స్థిరచిత్తంతో ఎదుర్కొనే మానసిక దృఢత్వాన్ని, శీల నిర్మాణాన్ని పెంపొందించడం.స్వామి వివేకానంద చెప్పిన మాటలు విద్యా వ్యవస్థకు మూల స్తంభం లాంటివి. అయితే భారతీయ విద్యావ్యవస్థ నేడు ఒక విచిత్రమైన, విచారకరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు అంతర్జాతీయ వేదికలపై భారతీయ మేధోసంపత్తి, ఐఐటీ , ఐఐఎమ్ గ్రాడ్యుయేట్లు ప్రపంచ మార్కెట్ ను శాసిస్తుంటే.. మరోవైపు అవే దేశీయ విద్యా సంస్థలు రాజకీయ స్వార్థానికి, మానసిక సున్నితత్వానికి , సిద్ధాంతపరమైన కుట్రలకు బలైపోతున్నాయి. విద్యాలయాలు అంటే కేవలం జ్ఞానాన్ని పంచే దేవాలయాలు మాత్రమే కాదు, విద్యార్థి భవిష్యత్తుకు అవసరమైన క్రమశిక్షణను నూరిపోసే కేంద్రాలు. కానీ, దురదృష్టవశాత్తు నేడు ప్రతి చిన్న చేదు అనుభవాన్ని, తప్పు చేసినప్పుడు పట్టుబడిన క్షణాన్ని 'కులం' కోణంలోనో, వ్యవస్థీకృత వేధింపుల రూపంలోనో రంగు పూసి రాజకీయ రొంపిలోకి లాగడం సర్వసాధారణమైపోయింది. ఐఐటీ బాంబేలో ఇటీవల చోటుచేసుకున్న ఒక విషాదకర సంఘటన ఈ రుగ్మతకు అద్దం పడుతోంది.దేశంలోనే అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థగా, జేఈఈ అడ్వాన్స్డ్ రాసే ప్రతి ప్రతిభావంతుడైన విద్యార్థి మొదటి కలగా భావించే ఐఐటీ బాంబే లో ఇటీవల సాహిల్ అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడంగ్గ్భ్రాంతిని కలిగించింది. అయితే, ఈ ఆత్మహత్య వెనుక ఉన్న ప్రాథమిక కారణాలను నిష్పాక్షికంగా విశ్లేషిస్తే అసలు నిజం బయటపడుతుంది. పరీక్షా హాలులో మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ ఇన్విజిలేటర్‌కు దొరికిపోవడంతో, దానికి భయపడి , ఆ క్షణంలో వచ్చిన తీవ్ర ఒత్తిడిని, అవమానాన్ని తట్టుకోలేక ఆ విద్యార్థి ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. నిబంధనల ప్రకారం మొబైల్ స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయడం మినహా ఇన్విజిలేటర్ చేసింది ఏమీ లేదు. విధి నిర్వహణలో భాగమైన ఒక సాధారణ క్రమశిక్షణా చర్యను తప్పుగా అర్థం చేసుకుని విద్యార్థి తీసుకున్న తొందరపాటు నిర్ణయం విచారకరమే అయినప్పటికీ, దానికి ఇన్విజిలేటర్‌ను , సంస్థను బాధ్యులను చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. కానీ, దురదృష్టవశాత్తు ఇక్కడే మన రాజకీయ రాబందులు రంగ ప్రవేశం చేశాయి. సదరు విద్యార్థి దళిత నేపథ్యం కలిగినవాడు కావడమే ఆలస్యంగా, దాన్ని ఆసరాగా చేసుకుని తప్పు చేసిన విద్యార్థిని వెనుకేసుకురావడం మాత్రమే కాకుండా.. నేరుగా కుల రాజకీయాన్ని తోడేశారు. తప్పును దిద్దాల్సిన చోట విక్టిమ్ కార్డ్ ఉపయోగిస్తూ, నిబంధనల ప్రకారం వ్యవహరించిన ఇన్విజిలేటర్లు, ప్రొఫెసర్లపై ఏకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ వేధింపుల కేసులు నమోదు చేసేంత వరకు వ్యవహారాన్ని దిగజార్చారు. తప్పు చేసినప్పుడు పట్టుబడటాన్ని ఒక సాధారణ క్రమశిక్షణా అంశంగా చూడకుండా, దానికి కులాన్ని రుద్ది రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం విద్యా వ్యవస్థకే అతిపెద్ద విపత్తుగా మారింది. ఒకప్పుడు పాఠశాలల్లో ఉపాధ్యాయుల చేతుల్లో చింతబరికెలు, బెత్తాలు కనిపించేవి. అవి విద్యార్థులపై కక్ష సాధించడానికో, శారీరకంగా హింసించడానికో ఉపయోగించినవి కావు; కేవలం వారి భవిష్యత్తును దిద్ది తీర్చడానికి, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా నిలబెట్టడానికి వేసిన క్రమశిక్షణా అడుగులు. నాడు ఉపాధ్యాయుల చేతిలో దెబ్బలు తిన్న ఏ ఒక్కరూ ఈనాడు దాన్ని వేధింపులుగానో, ఆత్మాభిమానానికి జరిగిన భంగంగానో భావించరు. ఆ రోజు నా మాస్టారు నన్ను సరిదిద్దకపోయి ఉంటే, నాలుగు దెబ్బలు వేసి దారిలో పెట్టకపోయి ఉంటే నేను ఈ రోజు ఈ ఉన్నత స్థాయిలో ఉండేవాడిని కాదు అని నేటి సమాజంలో ఉన్నత పదవుల్లో ఉన్నవారు సగర్వంగా చెప్పుకోవడమే ఆనాటి విద్యావిధానం సాధించిన విజయానికి సాక్ష్యం. కానీ, నేడు పాఠశాలల్లో ఆనాటి విద్యా వాతావరణం పూర్తిగా రూపుమాసిపోయింది. ఉపాధ్యాయుడి చేతిలో బెత్తం ఉండటం దేవుడెరుగు, కనీసం చేతిలో ఉన్న చాక్‌పీస్‌ను కూడా గట్టిగా విసిరి కొట్టలేని, హెచ్చరించలేని పరిస్థితులు నెలకొన్నాయి. పిల్లాడిని కొట్టకూడదు, తిట్టకూడదు, చివరికి గట్టిగా అరవకూడదు అంటూ కార్పొరేట్ సంస్కృతి తెచ్చిన కఠినమైన నిబంధనలు ఉపాధ్యాయుల చేతులను, నోళ్లను కట్టేశాయి. టీచర్ తరగతి గదిలో విద్యార్థిని చిన్నగా మందలించినా సరే, మరుసటి రోజే తల్లిదండ్రులు బడిపైకి దండయాత్రకు వస్తూ రచ్చ చేస్తున్నారు. యూనివర్సిటీల్లో చోటుచేసుకునే ప్రతీ విచారకర సంఘటనను, విద్యార్థుల వ్యక్తిగత మానసిక ఒత్తిళ్లను , నైతిక లోపాలను విస్మరించి, దాని వెనుక కుల వివక్ష ఉందనే నెరేటివ్‌ను రుద్దడం నేడు రాజకీయ పక్షాలకు ఒక లాభదాయకమైన ట్రెండ్‌గా మారింది. గతంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నప్పుడు జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు వచ్చి చేసిన రాజకీయ రచ్చ, ఆ తదనంతర పరిణామాలు దేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను ఏ రీతిలో అస్థిరపరిచాయో మనమందరం చూశాం.ఈ రాజకీయ జోక్యం వల్ల విద్యాలయాల అంతర్గత వాతావరణం, విద్యా ప్రమాణాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. మన దేశానికి చెందిన అత్యున్నత విద్యా సంస్థలపై నిరంతరం ఇటువంటి రాజకీయ బురదజల్లే ప్రచారాలు సాగడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో భారతీయ విద్యా ప్రమాణాల పట్ల ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయి. గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో మన సంస్థలు పోటీపడుతున్న తరుణంలో, క్యాంపస్‌ల నిరంతర రాజకీయ అశాంతి వల్ల విదేశీ పరిశోధనలు, పెట్టుబడులు, అంతర్జాతీయ విద్యార్థుల ఆగమనం దెబ్బతింటాయి. రాజకీయ నేతలు తమ స్వల్పకాలిక ఓటు బ్యాంక్ ప్రయోజనాల కోసం స్వతంత్ర విద్యావ్యవస్థలను బలిపశువులను చేయడం తక్షణమే ఆపకపోతే, దేశీయ మేధో రంగానికి పూడ్చలేని నష్టం వాటిల్లుతుంది. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా ? సిలికాన్ వ్యాలీ నుంచి గ్లోబల్ హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ల వరకు ? ఉన్నత స్థానాల్లో ఉన్న భారతీయులు ఇదే భారతీయ విద్యా వ్యవస్థలో చదువుకుని పైకి వచ్చినవారే! మన విద్యావ్యవస్థలో ఎన్నో ప్లస్ పాయింట్లు ఉన్నాయి. అయితే, కాలానికి తగినట్లుగా విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా జీవితంలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను, పరాజయాలను, విమర్శలను ఎదుర్కొనే రెసిలియెన్స్, మానసిక పరిణతిని నేర్పేలా విద్యావిధానం మారాలి. అంతేకాకుండా, రాజకీయ నాయకులు తమ ఓటు బ్యాంకు ప్రయోజనాల కోసం విద్యాసంస్థలను వాడుకోవడం తక్షణమే ఆపాలి. రాజకీయ నాయకులు ఈ దేశానికి అంతగా ఏం మేలు చేశారో తెలియదు కానీ, క్యాంపస్‌లలో కుల, మత, సిద్ధాంత విషబీజాలు నాటి పూడ్చలేనంత నష్టం మాత్రం చేస్తున్నారు. మన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బడులను, కళాశాలలను, ఐఐటీలను ఆ రాజకీయ కాలుష్యం నుంచి విముక్తి చేస్తే చాలు.. మన విద్యావ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మానవ వనరులను తయారు చేసి దేశానికి అంతకంటే గొప్ప సేవ చేస్తుంది!

# దళారుల రాజ్యం..!




- పంట రైతుది...
  ధర నిర్ణయం దళారులదా....?
- సక్రమంగా లేని సరఫరా గొలుసులో
  మధ్యవర్తులదే ఆధిపత్యమా?
- చీనీ, టమాటా, పండ్లు, కూరగాయల మార్కెట్‌లో
  రైతుకు తప్పని ధరల సంక్షోభం
- పంట అమ్మిన తర్వాత కూడా
  డబ్బుల కోసం రైతు ఎదురుచూపులు
- రైతు పండించిన పంటకు విలువ పెరిగినా.. ఆ విలువలో
  రైతు వాటా ఎంత.?

అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం

రైతు పండిస్తాడు.. వినియోగదారుడు కొనుగోలు చేస్తాడు. కానీ ఈ ఇద్దరి మధ్య ఉన్న మార్కెట్ వ్యవస్థలో అసలు లాభం ఎవరికి దక్కుతోంది? రైతు ఆరుగాలం శ్రమించి పంట పండించినా గిట్టుబాటు ధర లభించక నష్టపోతుండగా.. అదే ఉత్పత్తిని వినియోగదారుడు అధిక ధరకు కొనాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రైతు, వినియోగ దారుడి మధ్య ధరలో భారీ వ్యత్యాసం ఎందుకు ఉంటుందన్న ప్రశ్నకు వ్యవసాయ సరఫరా గొలుసులోని లోపాలు సమాధానంగా కనిపిస్తున్నాయి.

టమాటా వంటి త్వరగా పాడయ్యే పంటల్లో ధరల అస్థిరత ఈ సమస్య తీవ్రతను వెల్లడిస్తోంది. 2026 సెప్టెంబర్ 25న ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన టమాటా మార్కెట్ ధరల్లోనే మార్కెట్ల మధ్య గణనీయమైన వ్యత్యాసం కనిపించింది. కొన్ని మార్కెట్లలో మోడల్ ధర క్వింటాల్‌కు రూ. 1,100 ఉండగా, మదనపల్లిలో రూ. 2,400గా నమోదైంది.

**రైతు పంటకు ధర.. మార్కెట్‌లోనే నిర్ణయమా?**

రైతు తన పంటను మార్కెట్‌కు తీసుకువచ్చిన తర్వాత కమిషన్, తరుగు, అన్‌లోడింగ్, రవాణా తదితర ఖర్చులు భరించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తక్షణ నగదు అవసరం ఉన్న రైతులు తోట వద్దే పంటను తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబు తున్నారు.అమ్మకపు ప్రక్రియలో పారదర్శకత లేకపోతే రైతు తన పంటకు లభించే అసలు మార్కెట్ విలువను తెలుసుకునే అవకాశం కోల్పోతాడు.

అందువల్ల వేలం ప్రక్రియ, ధరల సమాచారం, కోతలు, చెల్లింపుల వివరాలు రైతుకు స్పష్టంగా అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది.

**చీనీ రైతుల సమస్యలకు పరిష్కారం ఎక్కడ?**

అనంతపురం ప్రాంతంలో చీనీ రైతులు ఎదుర్కొంటున్న మార్కెట్ సమస్యలపై కూడా చర్చ అవసరం. పంట విక్రయంలో పారదర్శకత, కమిషన్ విధానం, వివిధ రకాల కోతలు, చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలపై రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.ఈ-నామ్ వంటి డిజిటల్ మార్కెట్ విధానాలను రైతుకు అర్థమయ్యేలా, పారదర్శకంగా అమలు చేయడంతో పాటు.. మార్కెట్‌లో నమోదయ్యే ధర, రైతుకు చెల్లించే మొత్తం, విధించే కోతల వివరాలు డిజిటల్‌గా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**పంట అమ్మినా.. డబ్బు కోసం ఎదురుచూపులేనా?**

వ్యవసాయ మార్కెట్‌లో మరో ప్రధాన సమస్య చెల్లింపుల ఆలస్యం. పంట విక్రయించిన తర్వాత రైతుకు వెంటనే డబ్బు అందకపోతే.. తదుపరి పంటకు పెట్టుబడి పెట్టడం కూడా కష్టమవుతుంది. పంట అమ్మిన సొమ్ము కోసం రైతు అధికారులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా పటిష్టమైన చెల్లింపు వ్యవస్థ అవసరం.మార్కెట్‌లో వ్యాపారం చేసే వారి నుంచి రైతుల ప్రయోజనాలను రక్షించే విధంగా నియంత్రణ వ్యవస్థ పనిచేయాలి. బకాయిలు చెల్లింపులో జాప్యం లేదా నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులకు వేగవంతమైన పరిష్కార మార్గం ఉండాలి.

**బలహీనమైన సరఫరా గొలుసు.. రైతుకే నష్టం**

వ్యవసాయ సరఫరా గొలుసు అంటే పంటను పొలం నుంచి మార్కెట్‌కు తరలించడం మాత్రమే కాదు. ఉత్పత్తి, సేకరణ, నిల్వ, రవాణా, మార్కెటింగ్, పంపిణీ వంటి అనేక దశలు ఇందులో ఉంటాయి. ఈ దశల్లో ఏదైనా బలహీనంగా ఉంటే పంట నష్టం పెరిగి చివరికి రైతు ఆదాయంపైనే ప్రభావం పడుతుంది.కోల్డ్ స్టోరేజీలు, గోదాములు, వేర్‌హౌస్‌లు, శీతల రవాణా వంటి మౌలిక సదుపాయాల కొరత త్వరగా పాడయ్యే పంటలకు పెద్ద సమస్యగా మారుతుంది. పంటను వెంటనే అమ్మాల్సిన పరిస్థితి రైతు బేరసారాల శక్తిని కూడా తగ్గిస్తుంది.

**వ్యవసాయం జూదంగా మారకూడదు**

ఏ ప్రాంతంలో ఎంత పంట సాగవుతోంది? రాబోయే నెలల్లో ఎంత దిగుబడి వచ్చే అవకాశం ఉంది? మార్కెట్‌లో డిమాండ్ ఎంత ఉంది? వంటి సమాచారాన్ని రైతులకు ముందుగానే అందించే వ్యవస్థ అవసరం.పంట వేసే ముందు మార్కెట్ సమాచారం.. పంట చేతికొచ్చినప్పుడు నిల్వ సౌకర్యం.. విక్రయ సమయంలో పారదర్శక ధర.. పంట అమ్మిన వెంటనే చెల్లింపు ఈ నాలుగు అంశాలు రైతు ఆర్థిక భద్రతకు కీలకం.

2026లో ఆంధ్రప్రదేశ్ టోటాపురి మామిడి రైతులకు మార్కెట్ ధరల పతనం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ధర లోటు చెల్లింపు విధానాన్ని మంజూరు చేయడం కూడా ధరల అస్థిరతకు విధానపరమైన పరిష్కారాల అవసరాన్ని చూపిస్తోంది.

**రైతు కేంద్రంగా మార్కెట్ వ్యవస్థ అవసరం**

రైతుల ఆదాయాన్ని పెంచడం అంటే కేవలం పంటకు ఎక్కువ ధర ప్రకటించడం మాత్రమే కాదు. పెట్టుబడి వ్యయం తగ్గాలి.పంట నష్టం తగ్గాలి.మధ్యవర్తిత్వ వ్యయం తగ్గాలి.. మార్కెట్ సమాచారం అందుబాటులోకి రావాలి.. నిల్వ సామర్థ్యం పెరగాలి.. విక్రయం పారదర్శకంగా జరగాలి.. డబ్బు సకాలంలో రైతు ఖాతాలో జమ కావాలి. రైతు పండించిన సరుకు వినియోగ దారుడి చేతికి చేరే వరకు ప్రతి దశలో విలువ పెరుగుతోంది.

ఆ విలువలో రైతు వాటా మాత్రం తక్కువగా ఉంటే వ్యవసాయ మార్కెట్ వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తడం సహజం.

రైతు కష్టానికి గిట్టుబాటు ధర.. పంటకు పారదర్శకమైన మార్కెట్.. సరుకుకు సమర్థవంతమైన సరఫరా గొలుసు.. అమ్మిన పంటకు సకాలంలో చెల్లింపు ఇవి రైతుకు ఉపకారాలు కాదు.. వ్యవసాయ మార్కెట్ వ్యవస్థలో అతనికి దక్కాల్సిన న్యాయమైన హక్కులు.

# మానవతా విలువలు, సమానత్వానికి నిదర్శనం జాషువా కవిత్వం

ఉరవకొండ - సూర్య వాస్తవం




తన రచనల్లో మానవతా విలువలు, సమానత్వ భావనకు ప్రాధాన్యతనిచ్చిన గొప్ప కవి గుర్రం జాషువా అని ఉరవకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శైలజారాణి కొనియాడారు. గుర్రం జాషువా తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసిన మహాకవిగా ఆమె అభివర్ణించారు. సామాజిక అసమానతలు, కుల వివక్ష, అంటరానితనం వంటి సమస్యలను తన కవిత్వం ద్వారా ప్రశ్నిస్తూ సమాజంలో చైతన్యం తీసుకురావడానికి జాషువా కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ తెలుగు కవి, సామాజిక చైతన్యవాది గుర్రం జాషువా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలకు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ పి. సోమశేఖర్ మాట్లాడుతూ జాషువా కవిత్వం సామాన్య ప్రజల జీవితాలను ప్రతిబింబించడంతో పాటు సమాజంలోని వివక్షను ఎత్తిచూపిందన్నారు. "రాజు మరణించె నొక తార రాలిపోయె... సుకవి జీవించే ప్రజల నాలుకల యందు" అనే జాషువా పద్యాన్ని ప్రస్తావిస్తూ, మంచి కవి తన రచనల ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వివరించారు. ఆంగ్ల అధ్యాపకుడు నారాయణస్వామి మాట్లాడుతూ జాషువా పద్యాలను ఉదరిస్తూ చక్కటి సందేశాన్ని వివరించారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు జమీల బిబీ గారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మంచి మంచి కవులు ఉన్నారని వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని మన జీవితం మెరుగుపరుచుకోవాలని సూచించారు, తెలుగు అధ్యాపకురాలు రేణుకాదేవి జాషువా జీవితం, సాహిత్య ప్రస్థానం, రచనల్లోని సామాజిక సందేశం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు జాషువా రచనల్లోని మానవతా, సమానత్వ, సామాజిక చైతన్య భావాలను తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాషువా పద్యాలను పఠించి, ఆయన సాహిత్య విశిష్టతను స్మరించుకున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

**- ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆర్థిక మంత్రి**
**- సమస్యలపై సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు**
**- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్న పయ్యావుల కేశవ్**



**అనంతపురం - సూర్య వాస్తవం :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు, నాయకులను మంత్రి స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను వివరిస్తూ మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను పరిశీలించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి, ప్రజలకు సత్వర పరిష్కారం అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజలకు భరోసా కల్పిస్తూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి

**- ఆకాంక్షించిన మహబూబ్ బాషా...!**
**- సీఐను మర్యాదపూర్వకంగా కలిసిన ఐఎంఎం మహబూబ్ బాషా**
**- సీఐతో మైనార్టీ సమస్యలపై సౌహార్దపూర్వక భేటీ**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన కరుణా కర్‌ను ముస్లిం మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఐఎంఎం మహబూబ్ బాషా ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు సీఐ కరుణాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతపురం వన్‌టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ వలి, బాబావలి, శుభహాన్, ఇస్మాయిల్, ఖాజా హుస్సేన్, రషీద్, దాదా పీర్ తదితరులు పాల్గొన్నారు.

## 15 లక్షల కల్వర్టు, సీసీ రోడ్లకు భూమి పూజ చేసిన గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం బసినేపల్లి గ్రామంలో 15 లక్షల రూపాయలతో కల్వర్టు, సిసి రోడ్లకు గుంతకల్లు నియోజకవర్గం శాసనస భ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గుత్తి, పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ..మా నాన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఈ గుంతకల్ నియోజకవర్గంలో అడుగుపెట్టినప్పటి నుంచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. మరెన్నో పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. మీరు మా మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చెప్పిన మాట ప్రకారమే కచ్చితంగా గుంతకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపి చూపిస్తామని ఈ సందర్భంగా యువనేత గుమ్మనూరు ఈశ్వర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి మండల, పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నూతన అభి టీ కేఫ్‌ను ప్రారంభించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని టీడీపీ యువనాయకుడు, ఎమ్మెల్యే జయరాం ముఖ్య అనుచరుడు వాల్మీకి అశోక్‌కు చెందిన అభి టీ కేఫ్‌ను ప్రత్యేక ఆహ్వానం మేరకు గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి పామిడి టిడిపి ఇన్చార్జ్ గుమ్మనూర్ ఈశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి అశోక్‌ను అభినందిస్తూ శు భాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కత్తిమల ప్రభాకర చౌదరి, జింకల సంజీవ, రామాంజనేయులు నాయక్, వెంకటేష్,మండల కూటమి నాయకులు కార్యాకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ క్లైయిమ్లు, అభ్యంతరాలపై క్షేత్రస్థాయి పరిశీలన...!

**- ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచన**
**- ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలి**
**- ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ జి.సి. కిషోర్ కుమార్‌తో కలిసి రికార్డులు పరిశీలించిన కలెక్టర్ ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఏ. నారాయణపురం--2 స్వర్ణ గ్రామ సచివాలయం, విద్యారణ్యనగర్, పాపం పేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఐఆర్‌లో వచ్చిన క్లైయిమ్లు, అభ్యంతరాలను జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ జి.సి. కిషోర్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తో కలిసి ఆయా కేంద్రాలను సందర్శించిన అబ్జర్వర్.. ఓటర్ల నుంచి వచ్చిన క్లెయిమ్లు, అభ్యంతరాల వివరాలు, వాటిపై చేపడుతున్న పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. సంబంధిత అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి క్లైయిమ్, అభ్యంతరాన్ని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికా రులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా పరిశీలన, క్లైయిమ్ అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించిన రికార్డులను కూడా అధికారులు పరిశీలించారు.

## బాధితులకు వేగంగా... పారదర్శకంగా న్యాయం...!

**- 98 వినతులను నేరుగా స్వీకరించిన జిల్లా ఎస్పీ**
**- ప్రతి అర్జీని సమగ్రంగా విచారించాలని ఆదేశం**
**- కుటుంబ కలహాల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి**
**- ప్రజా ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి: ఎస్పీ పి. జగదీష్...!**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా, చట్ట పరిధిలో సమగ్రంగా విచారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాల యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా 98 వినతులను స్వీకరించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన.. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.బాధితులకు వేగంగా, పారదర్శకంగా న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా కుటుంబ కలహాలకు సంబంధించిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, మహిళా విభాగం డీఎస్పీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి హాజరైన బాధితులు, వారి సహాయకులకు ఇస్కాన్ సంస్థ సౌజన్యంతో ఉచిత భోజన సదుపాయం కల్పించారు.



## మహిళల రక్షణే లక్ష్యం.. క్షేత్రస్థాయిలో శక్తి బృందాలు...!

**- శక్తి యాప్'పై జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన- మహిళలు, యువతులకు యాప్ వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు**
**- బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు**




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** మహిళల భద్రతకు పోలీసు శాఖ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళా పోలీసులు, శక్తి బృందాల సభ్యులు 'శక్తి యాప్'పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, రద్దీ ప్రాంతాల్లో పర్యటించిన శక్తి బృందాలు మహిళలు, యువతులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్‌లో యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, అత్యవసర సమయంలో ఎస్ఓఎస్ బటన్‌ను ఎలా వినియోగించాలి అనే అంశాలను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం పోలీసు శాఖ నిరంతరం పనిచేస్తోందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు శక్తి యాప్ ద్వారా సమాచారం అందించిన వెంటనే సమీపంలోని పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, శక్తి బృందాలు స్పందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలు భయపడకుండా శక్తి యాప్‌ను తమ స్మార్ట్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వేధింపులు ఎదురైనా, ప్రమాదకర పరిస్థితులు తలెత్తినా ఆలస్యం చేయకుండా శక్తి యాప్ సేవలను వినియోగించుకోవాలని శక్తి బృందాల పోలీసులు మహిళలకు సూచించారు. మహిళల భద్రతపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

## గుంతకల్లు నియోజకవర్గంలో వైసీపీ బలోపేతమే లక్ష్యం

**- వైసీపీ అధికార ప్రతినిధి, రాష్ట్ర కార్యదర్శి గంటా నరహరి**



**గుంతకల్లు - సూర్య వాస్తవం :** జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలో గుత్తి, పామిడి ప్రాంతాల్లో వైసీపీని మరింత బలోపేతం చేసి, రానున్న స్థానిక సంస్థల ఎ న్నికల్లో పార్టీ అభ్యర్థుల విజ యానికి కృషి చేస్తామని వై ఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గంట నరహరి తెలి పారు.ఇటీవల వైఎస్సార్‌సీ పీ అధ్యక్షులు,మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి ఈ మేరకు హా మీ ఇచ్చినట్లు వెల్లడించా రు.గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరా మిరెడ్డితో కలిసి నియోజక వర్గంలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు,ఎంపీ టీసీ,జెడ్పీటీసీ స్థానాల్లో పా ర్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని ఎన్నికలకు సిద్ధ మవుతామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను,ప్ర భుత్వం ఇచ్చిన హామీల అమలు పరిస్థితిని ప్రజలు గమనిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నా రు.ఎన్నికల సమయంలో ప్రజలు తమకు అందిన అ నుభవాలను,గత ప్రభుత్వ పాలనను, ప్రస్తుత ప్రభుత్వ పనితీరును పరిశీలించి నిర్ణ యం తీసుకుంటారని తెలి పారు.వైఎస్సార్‌సీపీ ప్రభు త్వ హయాంలో అమలు చేసిన నవరత్నాలు,సంక్షే మ పథకాలు,విద్య,వైద్యం, రైతులు, మహిళలు, పేదల కోసం చేపట్టిన కార్యక్రమా లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించినట్లు ఆ పార్టీ వెల్లడించింది. గుంతకల్లు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్త లు,వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులను సమన్వయం చేసుకుని పార్టీ బలోపే తానికి కృషి చేస్తామని ఆ యన తెలిపారు.స్థానిక స మస్యలను ప్రజల నుంచి తెలుసు కుని, వాటి పరిష్కారం కోసం సమష్టిగా పనిచే యాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గుంతకల్లు నియోజకవర్గంలో వైసీపీని బలోపేతం చేయడం, రానున్న స్థానిక సంస్థల ఎ న్నికలకు పార్టీని సిద్ధం చేయడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా వేముల నాయుడు బాధ్యతల స్వీకరణ...!

**- కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా ఎదిగిన వేముల నాయుడు**

**- పదోన్నతిపై కుటుంబ సభ్యులు, సన్నిహితుల హర్షం**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వేముల నాయుడుకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సోమవారం రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఆయన హెడ్ కానిస్టేబుల్‌గా అధికారి కంగా బాధ్యతలు స్వీకరించారు. అంకంపల్లికి చెందిన వేముల నాయుడు గత 15 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో నిజాయితీగా విధులు నిర్వహిస్తూ సేవలందించారు. ఆయన సేవలకు గుర్తింపుగా లభించిన ఈ పదోన్నతిపై కుటుంబ సభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు. వేముల నాయుడు తమ్ముడు నాగరాజు మాట్లాడుతూ, తన అన్నకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులు వేముల నాయుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి అర్బన్ గుత్తి మున్సిపాలిటీలో రాబోవు మున్సిపల్ ఎలక్షన్స్ నిర్వహణలో భాగంగా మున్సి పాలిటీ పరిధిలో 62 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సలను భద్రపరచు స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేయుటకు స్థానిక టౌన్ కర్నూల్ రోడ్డులో గల జిల్లా బాలికల ఉన్నత పాఠశాలను మున్సిపల్ కమీషనర్ యన్. సురేంద్ర పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ గోవిందప్ప, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ మారుతి ప్రసాద్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అప్పస్వామి, ప్లానింగ్ సెక్రెటరీలు, ప్రిన్సిపల్ సుంకన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకటవ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

**పామిడి - సూర్య వాస్తవం :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక పామిడి మండల పరిధిలో అక్టోబర్ 2026 నెలకు సంబంధించిన అనంతపురము జిల్లాలో 2,75,708 పింఛను దారులకు రూ.123.81 కోట్లు ప్రభుత్వ నిధులు విడుదల చేయబడినవి.బ్యాంకు ఉద్యోగుల 3 రోజుల సమ్మె వాయిదా పడినందున యన్.టి.ఆర్. భరోసా పింఛనులు యధా ప్రకారం అక్టోబర్ 2026, 1వ తేది వృద్ధులు వితంతువులు, వైకల్యం ఉన్న వ్యక్తులకు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్య కారులు, డప్పు కళాకారులు, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాదిగ్రస్తులు మరియు ధీర్ఘకాల వ్యాదిగ్రస్తులు కు ఇందులో భాగంగా మండలం తాసిల్దార్ షర్మిల ఆదేశాల మేరకు(గురువారం) ఉదయం 7.00 గంటలకు స్వర్ణ గ్రామము మరియు వార్డ్ సిబ్బంది ద్వారా పింఛనుదారుని ఇంటి వద్దకే పింఛను పంపిణీ చేయబడుతుంది. పింఛనుదారులు అక్టోబర్ 2026, 1వ తేదిన ఉదయం తమ తమ ఇంటి దగ్గరే ఉండి పింఛను సొమ్ము పొందగలరని కోరడమైనది. ఎవరు కూడా పింఛను కొరకు సచివాలయాలకు గాని మరియు ఏఇతర కార్యాలయాలకు గాని వెళ్ళవలసిన అవసరం లేదని మండల తాసిల్దార్ షర్మిల పత్రిక ప్రకటనలో తెలియజేశారు.



## నేడు బీజేపీ సమగ్ర సమావేశం

**- పార్టీ సభ్యులందరూ తప్పక పాల్గొనాలి**

**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలో ఎద్దులపల్లి రోడ్డులో గల భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో నేడు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ సభ్యులందరూ పాల్గొనవలసిందిగా మండల బిజెపి అధ్యక్షులు చౌహాన్ అంజి నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు కొలకొండ్ల రాజేష్ పిలుపుమేరకు పామిడి మండలానికి సంబం ధించింది స్థానిక ఎన్నికలకు సంబంధి ంచిందిన అది ముఖ్యమైన సమావేశం నిర్వహి స్తున్నందున తప్పక పాల్గొన వలసినదిగా ఆయన కోరారు. ఎన్నికల బరిలో నిలబడబోవు అభ్యర్థుల వివరాలను జిల్లా పార్టీ కార్యాలయానికి పంపవలసి ఉన్నందున సభ్యులందరూ చర్చించవలసి ఉంటుంది, కావున తప్పక పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



## మహిళా విద్యార్థులకు మెరుగైన వసతులు...ఉపాధి అవకాశాలే లక్ష్యం...!

**- కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో "యువత భవితకు భరోసా" కార్యక్రమం**

**- త్వరలో వాటర్ ప్లాంట్.. అదనపు తరగతి గదుల ఏర్పాటుకు కృషి**

**- విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**




**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలోని కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో నిర్వ హించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్యా, మౌలిక వసతులపై ఆరా తీశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అనంతపురం జిల్లాలో మహిళా విద్యాభివృద్ధికి కళాశాల అందిస్తున్న సేవలను ఎంపీ అభినందించారు. అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూలు, పోటీ పరీక్షలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని మెరుగైన ఉద్యోగ అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్‌ను కూడా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం యువతకు మెరుగైన భవిష్యత్తును నిర్మించు కునేందుకు దోహద పడతాయని ఎంపీ పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతగా భావిస్తు న్నానన్నారు.కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. విద్యార్థినుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు అదనపు తరగతి గదుల ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషికి అనుగుణంగా అనంతపురం జిల్లాలో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎంపీ తెలిపారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి అన్నపూర్ణ, హాస్పిటల్ కమిటీ సభ్యులు నరసింహులు, వెంకటేశ్వర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలపై... టీడీపీ నేతల సమాలోచన...!

**- పార్టీ శ్రేణుల సమన్వయంపై దృష్టి**

**- ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆసక్తికర భేటీ**

**- కడప జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ దీపక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అమీర్ బాబు**



**కడప - సూర్య వాస్తవం :** స్థానిక సంస్థల ఎన్నికలకు కడప జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ శాసన మండలి సభ్యులు దీపక్ రెడ్డిని తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జ్ వీఎస్ అమీర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.కడప నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకర్తల సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరంపై నేతలు చర్చించినట్లు సమాచారం. గ్రామ, మండల స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంతో పనిచేయడంపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది.ఈ సందర్భంగా దీపక్ రెడ్డిని అమీర్ బాబు అభినందించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులకు అవసరమైన సహకారం అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, తెలుగు యువత నగర మాజీ అధ్యక్షుడు మేకల వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుర్రం జాషువా 131వ, భగత్ సింగ్ 119వ జయంతి

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ మైదా నంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ప్రెసిడెంట్ అబూ బాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు ఆధ్వర్యంలో గుర్రం జాషువా 131వ జయంతి,భగత్ సింగ్ 119వ జయంతి ఘనంగా నిర్వహించారు. కోశాధికారి జెన్నేకు ల్లాయిబాబు, సెక్రెటరీ రామ్ మోహన్,గుర్రం జాషు వా,భగత్ సింగ్ చిత్ర పటాలకుపూ ల మాల వేసి నివాళులర్పించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ జా షువా తండ్రి శ్రీ కృష్ణుడు పుట్టిన యాదవ కులము తల్లి మాదిగ కానీ వారి తండ్రి మతం మారి పాస్టర్గా ప ని చేశారు.1928 నుండి 1942 వర కు గుంటూరులోనే ఉన్నత పాఠశాల లో "తెలుగు పండితులుగా "పని చే శారు.వీరికి బిరుదులు కవితా విశా రద,కవి కోకిల,కవి దిగ్గజ, నవయుగ కవి చక్రవర్తి, మధురశ్రీ, విశ్వకవి సా మ్రట్.భగత్ సింగ్ భారత స్వాతంత్ర్య సమర యోధుడు హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ పార్టీ స్థాపకుడు. నేటి దేశ యువతకు మార్గదర్శకులు.విప్లవ వీరుడుకి శత కోటి వం దనాలు.వీరు కేవలం 23 సంవత్స రాల వయస్సులోనే దేశ స్వాతం త్ర్య ము కోసం తన ప్రాణాలకు త్యాగం చేసిన భగత్ సింగ్ అని కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లా యి బాబు, సెక్రెటరీ రామ్మోహన్, నారాయణరెడ్డి, గోవిందప్ప, నారాయణ శెట్టి, వెంకటేష్, గోవిందు, సుబుర్, వేణుగోపాల్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



## సీఈసీ తీరుకు వ్యతిరేకంగా ఎస్.ఈ.సి. కార్యాలయం ముట్టడి

- భారీగా తరలిన సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ (సీఈసీ)జ్ఞానేశ్వర్ రావు సర్ ప్రక్రియ పేరుతో సొంత అజెండాతో వ్యవహరిస్తూ,ఎలక్షన్ కమిషనర్ల సలహాలు, సూచనలు తీసుకోకుండా అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లి, వర్కింగ్ ప్రెసిడెంట్ జెడి శీలం ఆదేశాల మేరకు ఈరోజు విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్షన్ కమిషన్ (ఎస్ఇసి) కార్యాలయ ముట్టడి కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాల గురవం బాబు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాకు చెందిన ఏడు నియోజకవర్గాల ఇన్చార్జులు,నాయకులు పాల్గొన్నారు.ముఖ్యంగా సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ డి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గండవరం రమేష్ రెడ్డి,జిల్లా అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్ దాసరి రత్నం,శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ తలపా దామోదర్ రెడ్డి,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంబాకం హరికృష్ణ,జిల్లా కిసాన్ అధ్యక్షులు జోగి వినోద్,సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యదర్శి బొగ్గుల సురేష్,సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శ్వేతా రాణి, దొరవారిసత్రం మండల మహిళా అధ్యక్షులు చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు. సీఈసీ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు




**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల,బి.క్యాంప్, కర్నూలులో షహీద్ భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్. నాగస్వామి నాయక్ మాట్లాడుతూ,దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ చేసిన త్యాగం,ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు.చిన్న వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన భగత్‌సింగ్‌ను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భగత్‌సింగ్ జీవిత చరిత్ర,స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర,దేశం కోసం చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు.యువతలో దేశభక్తి,సామాజిక బాధ్యత,ధైర్యం,దేశ సేవా భావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు భగత్‌సింగ్ దేశభక్తి,త్యాగం,ఆశయాలను స్మరించుకున్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, విజయశేఖర్, రామకృష్ణ, కృష్ణమోహన్, సోమేష్, ఉల్గోజి రావు, శారధి పటేల్,శ్రీధర్ మూర్తి,బాలు,తదితర స్టాఫ్ సభ్యులు పాల్గొన్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** శ్రీ సత్యసాయి (అనంతపూర్)జిల్లా తనకల్ మండలం కొక్కంటి క్రాస్"సత్యన్న సేన"సభ్యుల అధ్వర్యంలో 5 మంది గర్భిణీ స్త్రీల కు ఆరు రకాల పౌస్టిక ఆహారాన్ని అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా" సత్యన్నాసేన" సభ్యులు సంకు వెంకటరమణ మాట్లాడుతూ"సత్యన్నా సేన"ద్వారా కరోనా సమయంలో నుండి, తరువాత కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉన్నామని అన్నారు. ఇలాంటి కార్యక్రమ కొనసాగింపుగా గర్భిణులకు ప్రతి నెలా అమృత పౌస్టిక ఆహారాన్ని కానుపు అయ్యేవరకు అందజేయడం జరుగుతుంది. ప్రతి నెలా మా ప్రాంతం(మా దృష్టికి)లో ఉన్న నిరుపేద గర్భవతులకు నెలలు నిండేవరకు సత్యన్న సేన ఆధ్వర్యంలో పౌస్టికాహారం అందజేయడం జరుగుతోంది.

ఈ కార్యక్రమానికి స్ఫూర్తి ప్రధాత అయిన సత్యకుమార్ యాదవ్ (రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి)కి ఆ ప్రాంత గర్భ వతులు ప్రతి నెల పౌష్టికాహారాన్ని పొందడమే కాకుండా మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలియ జేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సత్యన్నా సేనా సభ్యులు, విశ్వనాథ్ భాస్కర్ సుధాకర్ గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలలో భక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత

- "మంత్రి సత్య కుమార్ యాదవ్"



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** అక్టోబర్ 11 నుంచి 20 తేది వరకు జరుగనున్న దసరా మహోత్సవాలలో భక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యతగా చూడాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు అన్నారు,ఆయన సోమ వారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీ ప్రభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు 2026 ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహిం చామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్టోబర్ 11 నుంచి 20 వరకు జరగనున్న ఈ మహోత్సవాలకు సుమారు 25 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, దర్శనం, క్యూ లైన్లు,తాగునీరు,పారిశుద్ధ్యం, అన్నప్రసాదం,లడ్డూ ప్రసాదం,వైద్య సేవలు,భద్రత, ట్రాఫిక్,పార్కింగ్ తదితర ఏర్పాట్లను సమీక్షించాం అన్నారు. సుమారు 60 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేయడంతో పాటు,ఏఐ కెమెరాలు,సీసీటీవీ నిఘా, ప్రత్యేక నియంత్రణ కేంద్రం,షటిల్ బస్సులు,డిజిటల్ సమాచార వ్యవస్థల ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నాం. భక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత -- భక్తుల భద్రతే ప్రధాన బాధ్యత అనే లక్ష్యంతో అన్ని శాఖల సమన్వయంతో దసరా మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.





# నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గం అన్ని రంగాలలో ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యం అంటూ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర 2047"లక్ష్యాలను క్షేత్రస్థాయికి చేరవేస్తూ సూళ్లూరుపేట నియోజకవర్గ సమగ్ర ప్రగతి కోసం రూపొందిస్తున్న నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ అమలులో అధికారులు పూర్తి అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు.సోమవారం సూళ్లూరు పేట లోని శేష సాయి కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే అధ్యక్షతన నియోజ కవర్గ స్థాయి అన్ని శాఖల అధికారులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆర్డీవో దేవేందర్ రెడ్డి,డీఎస్పీ చెంచు బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి శాఖ పనితీరును, పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించి, "స్వర్ణాంధ్ర 2047" విజన్‌కు అనుగుణంగా ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలను పటిష్టంగా కాపాడాలని, పారిశ్రామిక, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు, మహిళలకు పూర్తి రక్షణ కల్పించేలా నిరంతర నిఘా ఉంచాలని డీఎస్పీ కి సూచించారు.భూ వివాదాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆర్డీవో కి,రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా,వేగవంతంగా పూర్తి చేసి రైతులకు,సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని స్పష్టం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా మురుగు కాలువల పూడికతీత,తడి-పొడి చెత్త సేకరణ పనులను సమర్థ వంతంగా నిర్వహించాలని, పరిశుభ్రమైన నియోజక వర్గంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. నియోజక వర్గంలోని ప్రతి ఆవాస ప్రాంతానికి నిరంతరం స్వచ్ఛమైన మంచి నీరు అందేలా చర్యలు చేపట్టాలని, లీకేజీలు, పైపులైన్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరి ంచాలని సంబంధిత విభాగాలకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కొరత రాకుండా రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాల వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, డీఎస్పీ తోపాటు నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయ కులు, పాల్గొన్నారు.



# హుస్సేనాపురం పాఠశాలలో ఘనంగా భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతి వేడుకలు

**ప్యాపిలి– సూర్య వాస్తవం:** స్థానిక పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పీఎంశ్రీ ) హుస్సేనాపురంలో భారత స్వాతంత్ర్య సమరయోధుడు శహీద్ భగత్ సింగ్ నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధా నోపాధ్యాయులు ( హెచ్ఎం) బి. చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని దేశభక్తుడు భగత్ సింగ్ మహాకవి గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు బి. చంద్రమౌళి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన భగత్ సింగ్ యువతకు స్ఫూర్తిప్రదాత అని కొని యాడారు. అలాగే సమాజంలోని అసమానతలపై తన కలం ద్వారా సమరం చేసిన అజాతశత్రువు, పద్మభూషణ్ గుర్రం జాషువా అని, వారి ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఉపాధ్యాయులు బి. సర్వజ్ఞ మూర్తి మాట్లాడుతూభగత్ సింగ్ చూపిన దేశభక్తి, త్యాగనిరతి నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని అన్నారు.

గుర్రం జాషువా తన గబ్బిలం' వంటి ప్రసిద్ధ రచనల ద్వారా సమాజంలో సమానత్వం కోసం మూఢనమ్మకాల నిర్మూలన కోసం చేసిన కృషిని విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. మహనీయుల జీవిత చరిత్రలను చదవడం ద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. రాఘవేణి, ఎం. కంభగిరి జె దివాకర్ టి. గోపాల్, రుక్సానా ఖాతూన్, సంధ్యారాణి, శ్రీకాంత్ బి మోహన్ రెడ్డి, రాజశేఖర్, శ్రావణి, వరలక్ష్మి మరియు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మహనీయుల సేవలను స్మరిం చుకున్నారు .



# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'..
# 'నారాయణమ్మ' పాట వచ్చేసింది!

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నెం. 47) నుంచి సంగీత సందడి మొదలైంది. ఈ చిత్రం నుంచి 'నారాయణమ్మ' అనే తొలి పాటను చిత్రబృందం ఆదివారం విడుదల చేసింది. విడుదలైన కొద్దిసేపటికే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.తమన్ స్వరపరిచిన ఈ మాస్ ఫోక్ నంబర్‌కు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. గాయకులు రామ్ మిరియాల, ప్రభ తమ గాత్రంతో పాటకు ఊపు తెచ్చారు. ముఖ్యంగా రామ్ మిరియాల వాయిస్ పాటకు జానపద కళను అద్దింది. ఈ పాటలో వెంకటేశ్ తనదైన ఎనర్జిటిక్ స్టెప్పులతో అభిమానులను ఉత్సాహపరిచారు. హీరోయిన్లు శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్‌లతో పాటు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డింపుల్ హయాతి తన గ్లామర్, మాస్ డ్యాన్స్‌తో అదరగొట్టింది.ఈ పాట విడుదల ఈవెంట్ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ, త్రివిక్రమ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "గతంలో త్రివిక్రమ్ రచయితగా ఉన్నప్పుడు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి క్లాసిక్ ప్రేమకథలు చేశాం. ఆ సినిమాల్లో నేను పెళ్లికాని వాడిని. ఇప్పుడు పెళ్లైంది, వైబ్ వేరేగా ఉంది. ఇది మామూలు కుటుంబం కాదు. 'ఆదర్శ కుటుంబం' వేరే లెవెల్‌లో ఉంటుంది. సరదాతో పాటు ప్రేక్షకులు ఎంజాయ్ చేసే ట్విస్టులు కూడా ఉంటాయి" అని సినిమాపై ఆసక్తిని పెంచారు.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా



నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదట అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించినా, తాజాగా అక్టోబర్ 9న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఈ మాస్ పాటతో ప్రమోషన్లు ప్రారంభించిన చిత్రబృందం, సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయింది.

## నెట్‌ఫ్లిక్స్‌లోకి మెగాస్టార్ చిరంజీవి..
# పాడ్‌కాస్ట్‌తో సరికొత్త ప్రయాణం!

తెలుగు చిత్రసీమలో దాదాపు 48 ఏళ్లుగా అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు సరికొత్త బాటలో ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. వెండితెరపై తన మాస్ ఇమేజ్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తనదైన ముద్ర వేయనున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి ఆయన ఒక ప్రత్యేకమైన పాడ్‌కాస్ట్ సిరీస్ చేయబోతున్నారు.తొలుత చిరంజీవి జీవిత ప్రస్థానంపై ఒక డాక్యుమెంటరీని రూపొందించాలని భావించినప్పటికీ, పాడ్‌కాస్ట్ అయితే తన భావాలను మరింత స్వేచ్ఛగా, నేరుగా పంచుకోవడానికి వీలుంటుందని ఆయన భావించినట్లు తెలుస్తోంది. ఈ వినూత్న ఆలోచనను ఆయన కుమార్తె, నిర్మాత సుస్మిత కొణిదెలతో పాటు ప్రముఖ రచయిత బీవీఎస్ రవి ప్రతిపాదించగా, చిరంజీవి వెంటనే అంగీకరించినట్లు సమాచారం.ఇప్పటికే పలు విజయవంతమైన టాక్ షోలకు పనిచేసిన అనుభవం ఉన్న బీవీఎస్ రవి ఈ ప్రాజెక్టుకు రచన, రూపకల్పన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాధారణ ఇంటర్వ్యూలలో పంచుకోని ఎన్నో వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలు, స్టార్‌డమ్ వెనుక ఉన్న శ్రమ, సినీ ప్రస్థానంలోని



ఎత్తుపల్లాలను ఈ పాడ్‌కాస్ట్ ద్వారా చిరంజీవి అభిమానులతో పంచుకోనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను నెట్‌ఫ్లిక్స్ త్వరలోనే విడుదల చేయనుందని తెలుస్తోంది.



## గంగా ఆసుపత్రికి రామ్ చరణ్ కృతజ్ఞతలు..
# వైద్యుల సేవలకు ప్రశంసలు



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, కోయంబత్తూరులోని గంగా ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే ఆయన ఒక వైద్య ప్రక్రియ కోసం ఆసుపత్రిలో చేరారు. చికిత్స పూర్తయిన అనంతరం తనకు అందించిన అత్యుత్తమ సేవలను ప్రశంసిస్తూ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు. వైద్య ప్రక్రియలో భాగంగా అంకితభావం, నైపుణ్యంతో తనకు చికిత్స అందించిన డాక్టర్ ఎస్. రాజా సభాపతి, డాక్టర్ ఎస్. రాజశేఖరన్, డాక్టర్ ప్రవీణ్ భరద్వాజ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఆసుపత్రిలో తనకు లభించిన సంరక్షణ పట్ల రామ్ చరణ్ పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. "గంగా ఆసుపత్రిలోని వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ నన్ను ఎంతో ఆప్యాయంగా, ఆత్మీయంగా చూసుకున్నారు. నాకు అందించిన సేవలకు నేనెంతో రుణపడి ఉంటాను" అని తన పోస్టులో పేర్కొన్నారు. వారు చూపిన ప్రత్యేక శ్రద్ధకు చరణ్ ముగ్ధులయ్యారు.ఇదే సందర్భంలో గంగా ఆసుపత్రి సాధించిన ఓ అరుదైన ఘనతను కూడా ఆయన అభినందించారు. వైద్య రంగంలో అత్యుత్తమ పరిశోధనకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక "నాస్ అవుట్‌స్టాండింగ్ రీసెర్చ్ పేపర్ అవార్డు"ను గంగా ఆసుపత్రి ఐదోసారి గెలుచుకోవడం పట్ల హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వైద్య రంగంలో ఆసుపత్రి చూపిస్తున్న అసమాన ప్రతిభకు ఇది సరైన గుర్తింపు అని కొనియాడారు. ప్రస్తుతం రామ్ చరణ్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.'పెద్ది' సినిమా చిత్రీకరణ సందర్భంగా రామ్ చరణ్ మణికట్టుకు గాయం కావడం తెలిసిందే. ఈ గాయానికి కొన్ని వారాల కిందట గంగా ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. తాజాగా, ఆ చికిత్సకు కొనసాగింపు ప్రక్రియను పూర్తి చేసుకున్నారు.



## ఆసియా క్రీడలు: వర్షంతో మ్యాచ్ రద్దు..
# నేరుగా సెమీస్‌కు టీమిండియా

ఆసియా క్రీడల్లో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య జరగాల్సిన రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న టీమిండియా నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. కరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు.ఉదయం 5:30 గంటలకు జరగాల్సిన పాకిస్థాన్-హాంకాంగ్ తొలి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కూడా ఇదే కారణంతో రద్దయింది. ఆ మ్యాచ్‌లోనూ అధిక ర్యాంకింగ్ ఆధారంగా పాకిస్థాన్ సెమీస్‌కు చేరుకుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్ 1 స్థానంలో ఉండగా.. ఆఫ్ఘనిస్థాన్ 10వ స్థానంలో ఉంది. మరోవైపు పాకిస్థాన్ 6వ ర్యాంకులో, హాంకాంగ్ 24వ ర్యాంకులో కొనసాగుతున్నాయి. ఈ నిబంధనల ప్రకారమే భారత్, పాక్ జట్లు ముందంజ వేశాయి.సెమీఫైనల్లో శ్రీలంక, నేపాల్ మధ్య జరిగే మూడో క్వార్టర్ ఫైనల్ విజేతతో



భారత్ తలపడుతుంది. మరో సెమీస్‌లో బంగ్లాదేశ్, మలేషియా మధ్య జరిగే నాలుగో క్వార్టర్ ఫైనల్ విజేతతో పాకిస్థాన్ పోటీ పడుతుంది. మిగిలిన క్వార్టర్ ఫైనల్స్ మంగళవారం, సెమీఫైనల్స్ గురువారం జరగనున్నాయి.

## టీమ్ బస్సు దిగుతూ జారిపడ్డ రోహిత్..
# కంగారుపడిన కోహ్లీ.. వీడియో వైరల్!

టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వెస్టిండీస్‌తో తొలి వన్డే ముగిసిన అనంతరం హోటల్‌కు తిరిగి వస్తున్న సమయంలో టీమ్ బస్సు దిగుతూ హిట్‌మ్యాన్ కాలుజారి కింద పడ్డాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటన జరిగినప్పుడు సమీపంలోనే ఉన్న విరాట్ కోహ్లీ



ఆందోళనగా స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షించింది.వివరాల్లోకి వెళితే.. తిరువనంతపురంలో వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. నిన్న రాత్రి మ్యాచ్ ముగిశాక జట్టు హోటల్‌కు చేరుకుంది. ఈ క్రమంలో బస్సు మెట్లపై రోహిత్ శర్మ పట్టుతప్పి కింద పడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన సహాయక సిబ్బంది, అక్కడే ఉన్న పోలీసులు అతడిని పైకి లేపారు.ఈ ఘటనలో రోహిత్‌కు ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కాగా, ఈ మ్యాచ్‌లో రోహిత్ 32 పరుగులు చేయగా, విరాట్ కోహ్లీ 139 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే సెప్టెంబర్ 30న గువాహటిలో జరగనుంది.





## సచిన్‌తో పోలిక నాకొద్దు..
# ఆయన ఒక లెజెండ్: కోహ్లీ

టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ తన పరుగుల దాహాన్ని కొనసాగిస్తున్నాడు. వెస్టిండీస్‌తో నిన్న తిరువనంతపురంలో జరిగిన మొదటి వన్డేలో అద్భుత శతకంతో చెలరేగిన కోహ్లీ, భారత జట్టుకు ఘన విజయాన్ని అందించడమే కాకుండా.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రెండు ప్రధాన రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ కేవలం 88 బంతుల్లోనే 139 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.ఈ ఇన్నింగ్స్‌లో భాగంగా కోహ్లీ వన్డే క్రికెట్‌లో 15,000 పరుగుల మైలురాయిని అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇంతకుముందు సచిన్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. అయితే, కోహ్లీ కేవలం 303 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును చేరగా, సచిన్‌కు దీనికోసం 377 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి. అంటే.. సచిన్ కంటే 74 ఇన్నింగ్స్‌లు తక్కువ ఆడి ఈ రికార్డును కోహ్లీ సొంతం చేసుకోవడం విశేషం.ఇదే మ్యాచ్‌లో కోహ్లీ మరో అరుదైన రికార్డును కూడా అధిగమించాడు. భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ (6,976) పేరిట ఉన్న రికార్డును కోహ్లీ బ్రేక్ చేశాడు. ఈ మ్యాచ్‌తో కోహ్లీ స్వదేశంలో 7,006 పరుగులు పూర్తి చేసి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇది కోహ్లీకి వన్డేల్లో 55వ సెంచరీ కాగా, లిస్ట్-ఏ క్రికెట్‌లో 60వ శతకం. ఈ క్రమంలో లిస్ట్-ఏ సెంచరీల విషయంలోనూ సచిన్ రికార్డును సమం చేశాడు.మ్యాచ్ అనంతరం తన రికార్డులు, సచిన్‌తో పోలికలపై కోహ్లీ వినమ్రంగా స్పందించాడు. "నాకు సచిన్ పాజీ ఎప్పటికీ సచిన్ పాజీనే. అతను తన కాలంలో ఆటలో విప్లవాత్మక మార్పులు తెచ్చాడు. అది సంఖ్యలు, పోలికలకు అతీతమైన విషయం. ప్రజలపై అతను చూపిన ప్రభావం ఎప్పటికీ నిలిచిపోతుంది" అని వ్యాఖ్యానించాడు.

## కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా

# కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్

### - కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
### -- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండ్







**మదనపల్లి-సూర్యవాస్తవం:** కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ స్వతంత్రత, విశ్వసనీయత కోల్పోయారని,వెంటనే రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండ్ చేశారు.సోమవారం మదనపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ అన్ని నియోజ కవర్గాల ఇన్‌చార్జీలతో కలిసి జ్ఞానేష్ కుమార్ తన పెదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణవాయువు అని, ఆ ఎన్నికలు స్వేచ్ఛా వాతావరణం లో నిష్పక్ష పాతంగా జరిగితే దానికి అర్థం ఉంటుందని లేకపోతే ప్రజా స్వామ్యం ప్రమాదంలో పడుతుందని చెప్పారు. ప్రస్తుతం కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి అయిన జ్ఞానేశ్ కుమార్ స్వతంత్ర కోల్పోయారని, కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగామారి ఓటర్లలో విశ్వసనీయత కోల్పోయారని ఆయన అన్నారు. 2029లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కొక్కరిని జైలుకు పంపించడం తప్పదని అన్నారు. అనంతరం రాయచోటి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆర్. అమీర్ భాష మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఓట్ల అక్రమాన్ని ఎండగట్టడం ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. ప్రధాన ఎన్ని కల అధికారి, మిగతా ఇద్దరు కేంద్ర ఎన్నికల అధికారుల మధ్య ఏకాభిప్రాయం లేదని, ప్రధాన ఎన్నికల అధికారి నియంత ధోరణిలో వ్యవహరిస్తున్నారని, 13 కోట్ల ఓటర్లను తొలగించడం అన్యాయమని, క్షేత్రస్థాయి ఈఆర్వోల అధికారాలను తగ్గించడం అప్రజాస్వామ్యమని అని మండిపడ్డారు. విశ్వసనీయత లోపించిన కారణంగా ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయన స్థానంలో మరో కొత్త ప్రధాన ఎన్నికల అధికారిని నియమించాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ తరపున అమీర్ డిమాండ్ చేశారు.ఎంపిక కమిటీలో కూడా కేంద్ర మంత్రి స్థానంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ ఖాన్, ఖాజా మొహిద్దిన్, మహమ్మద్ రఫీ, రాజేష్, సాయి, గిరిబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై హత్యలకు

# ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి

### న్యాయం కోసం ధర్మ పోరాట దీక్ష చేపట్టిన ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు




**కడప- సూర్య వాస్తవం :** రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న హత్యలు, దాడులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కడప కలెక్టరేట్ వద్ద ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు ఆధ్వర్యంలో దళితుల ధర్మ పోరాట దీక్ష చేపట్టారు. దళితులపై జరుగుతున్న హత్య కేసులను త్వరితగతిన విచారించేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 28 మంది దళితులు హత్యకు గురయ్యారంటూ సువర్ణరాజు ఆరోపించారు. హత్యలకు గురైన దళిత కుటుంబాలకు న్యాయం అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు నిందితులకు చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేసిన దళితుల సమస్యలపై ముఖ్యమంత్రి, హోంమంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. రాజకీయాలకు అతీతంగా దళితుల భద్రత, హక్కులు, న్యాయం కోసం ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. హత్యలకు గురైన దళిత బిడ్డల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు వారికి తగిన పరిహారం, రక్షణ కల్పించాలని కోరారు. దళితులపై నేరాలకు పాల్పడే వారిపై ఎటువంటి జాప్యం లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని దీక్ష సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. దళితులపై దాడులు, హత్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ ధర్మ పోరాట దీక్షకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి స్టీరింగ్ కమిటీ సభ్యులు, దళిత క్రిస్టియన్ మైనార్టీ నాయకులు అకుమల్ల ప్రణయ్ కుమార్, రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామోజీ ఇమ్మనేల్, వీ3లా రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. దళితులపై జరుగుతున్న నేరాల విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. దళితుల భద్రత, న్యాయం కోసం చేపట్టిన ఈ ధర్మ పోరాట దీక్షకు వివిధ దళిత, క్రిస్టియన్ మైనార్టీ సంఘాల ప్రతినిధులు మద్దతు ప్రకటించారు.

## గ్రామకంఠం భూములపై సీఆర్డీఏ క్లారిటీ..

# మినహాయింపులకు కటాఫ్ తేదీ ఇదే

**విజయవాడ-సూర్య వాస్తవం :** ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని గ్రామకంఠం మినహాయింపులపై సీఆర్డీఏ శనివారం స్పష్టత ఇచ్చింది. 08-12-2014ను కటాఫ్ తేదీగా నిర్ణయించి.. ఆ తేదీకి ముందే నిర్మాణాలు ఉన్న భూములు, చదరపు గజాల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు చేసుకున్న ప్లాట్లను నిబంధనల ప్రకారం మినహాయింపునకు పరిశీలన చేసినట్లు తెలిపింది. గ్రామ నివాస ప్రాంతానికి దూరంగా ఉన్న ఖాళీ వ్యవసాయ భూములు, కటాఫ్ తర్వాత రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు మినహాయింపు వర్తించదని సీఆర్డీఏ తెలిపింది. ఇప్పటికే 6,473.72 ఎకరాలను ఎల్‌పీఎస్ నుంచి మినహాయించినట్లు సీఆర్డీఏ తెలిపింది. కమిటీకి వచ్చిన 685 దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు పేర్కొంది. రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, రిజిస్ట్రేషన్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. తాజా అప్లికేషన్లు, అభ్యంతరాలను జేసీ ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి ఖరారు చేస్తుందని సీఆర్డీఏ ఓ ప్రకటనలో తెలిపింది. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అన్ని ప్రయోజనాలు అందిస్తామని తెలిపింది.

విజయవాడలో దశాబ్దాల నాటి ఇళ్ల పట్టాల సమస్యకు ఏపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించింది. పేదల సొంతింటి కలకు భరోసా కల్పించేందుకు రెడీ అయింది. విశాఖలో 28,445 కుటుంబాలకు పట్టాలిచ్చిన తరహాలో ఈనెల 30న విజయవాడలో మరో భారీ కార్యక్రమం చేపట్టనుంది. 24,057 కుటుంబాలకు రూ.9,800 కోట్ల విలువైన భూమిపై క్రమబద్ధీకరణ పట్టాలను సీఎం చంద్రబాబు అందించనున్నారు. ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పేదల సొంతింటి కలను నెరవేర్చనున్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీతో ఒక్కో కుటుంబానికి సుమారు రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ప్రయోజనం చేకూరనుంది. తమ ఇళ్లకు శాశ్వత హక్కులు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు కోరుతున్నారు. వారి కల సాకారం నేడు సాకారం కానుంది. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. మొత్తం 15 మండలాల్లోని 617 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 29.86 లక్షల చదరపు గజాల స్థలాలపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయనుంది.

## స్మశాన వాటిక భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



**లక్కిరెడ్డిపల్లె -సూర్యవాస్తవం:** మండలంలోని చింతకుంట వాండ్ల పల్లె సమీపంలో సబ్ స్టేషన్ పక్కన వందల ఏళ్ల నుండి ఉన్న స్మశాన వాటిక భూమిని కొంతమంది ఆక్రమించుకుని స్వాధీనం చేసుకున్నారంటూ సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట చింతకుంట వాండ్లపల్లె గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. 150 ఏళ్ల పైబడి ఉన్న స్మశాన వాటిక భూమిని కొంతమంది వ్యక్తులు తమకు పట్టా ఇచ్చారంటూ దర్జాగా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు చేయడానికి ఎక్కడ సెంటు స్థలం లేదని వారు తాసిల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన చేపట్టారు. అనంతరం తాసిల్దార్ క్రాంతి కుమార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. స్మశాన వాటిక ఆక్రమణకు గురి కాకుండా చూడాలని తాసిల్దార్ కు వారు విన్నవించుకున్నారు. రెవెన్యూ సిబ్బందితో స్మశాన వాటిక భూమిని పరిశీలించి గ్రామస్థులకు న్యాయం చేస్తామని తాసిల్దార్ చెప్పడంతో అక్కడి నుండి గ్రామస్తులు వెనుతిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మహిళలు చింతకుంట వాండ్లపల్లె ప్రజలు పాల్గొన్నారు.

## పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం నూతన అధ్యక్షుడిగా గడ్డం గంగినాయుడు ఏకగ్రీవ ఎన్నిక



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** కేంద్రంలోని పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం మరియు కళ్యాణ మండపం నూతన అధ్యక్షుడిగా గడ్డం గంగినాయుడుని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.స్థానిక పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం మరియు కళ్యాణ మండపంలో ఆదివారం కమిటీ సభ్యుల సమక్షంలో సమావేశం నిర్వహించారు.గత కొంత కాలంగా అధ్యక్షుడిగా కొనసాగుతున్న తిప్పన బ్రహ్మయ్య అనివార్య కారణాల వల్ల,తన వ్యక్తిగత పనుల ఒత్తిడి కారణంగా స్వచ్ఛందంగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.దీంతో ఖాళీ అయిన అధ్యక్ష పదవికి కమిటీలో డైరెక్టర్ గా కొనసాగుతున్న గడ్డం గంగినాయుడు పేరును సభ్యులు ప్రతిపాదించారు. ఆయన సేవలను,సత్రం అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి కమిటీ సభ్యులు,పట్రా కులస్తులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో ఆయన నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.అనంతరం నూతన అధ్యక్షుడు గడ్డం గంగినాయుడు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కమిటీ సభ్యులకు, కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.సత్రం,కళ్యాణ మండపం అభివృద్ధికి అందరితో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం కమిటీ అభివృద్ధి కొరకు మరికొంత మంది కమిటీ డైరెక్టర్లుగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్రా నాయుళ్ల సంఘం కమిటీ సభ్యులు,కుల పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలినేని తగ్గని ప్రయారిటీ

**ఒంగోలు-సూర్య వాస్తవం :** మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి పవన్ కీలక బాధ్యతలు అప్పగించారు. ఇది జనసేనలో చర్చనీయాంశమైంది. నిన్నమొన్నటి వరకూ బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రయారిటీ లేదని భావించిన వారి నోళ్లను పవన్ ఒక్క చర్యతో మూయించగలిగారు. స్థానిక సంస్థల ఎన్నికలు, డీ లిమిటేషన్ ప్రక్రియపై త్రీ మెన్ కమిటీలో స్థానం కల్పించారు. నిజానికి ఇటీవల పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స చేయించుకోవడానికి వెళ్లిన సమయంలో ముఖ్యమైన సమావేశాలకు బాలినేని శ్రీనివాసరెడ్డి కి ఆహ్వానం అందలేదు. దీంతో జనసేనలో బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రయారిటీ తగ్గిందని అందరూ అనుకున్నారు. కొందరు ఆయన వ్యతిరేకులు గేలిచేశారు. మరికొందరు బాలినేని వైసీపీ కోవర్టు అంటూ ప్రచారాన్ని కూడా నిర్వహించారు. కానీ బాలినేని శ్రీనివాసరెడ్డి నిబద్ధత తెలిసిన పవన్ కల్యాణ్ ఆయనకు కీలక బాధ్యతలను అప్పగించడంతో ఆ ప్రచారానికి ఫుల్ స్టాప్ పడినట్లయింది. బాలినేని శ్రీనివాసరెడ్డిని ఉమ్మడి రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జల్లాల బాధ్యతలను అప్పగించారు. సామినేని ఉదయ భానుకు, నాదెండ్ల మనోహర్ కు కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతను అప్పగించారు. దీంతో బాలినేని శ్రీనివాసరెడ్డికి ఏ మాత్రం ప్రాధాన్యత తగ్గలేదని చాటి చెప్పారు. బాలినేని శ్రీనివాసరెడ్డి వల్ల చేరికలు కూడా ఊపందుకుంటాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలోనూ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనూ బలమైన నేతలను జనసేన పార్టీలోకి తీసుకు వచ్చేందుకు బాలినేని శ్రీనివాసరెడ్డి ఇప్పటికే కొందరితో టచ్ లో ఉన్నారు. రాయలసీమకు చెందిన ఒక వైసీపీ ముఖ్య నేత కూడా త్వరలో వస్తారని చెబుతున్నారు. అయితే ఆ నేత పేరు ఎవరన్నది బయటపెట్టకపోయినా త్వరలోనే ఆ నేత జనసేన తీర్థం పుచ్చుకుంటారని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ అందుకే బాలినేనికి కీలక బాధ్యతలను అప్పగించారు. ఇప్పటి వరకూ తన చుట్టూ ఉన్న నేతలు ఎవరూ ఒక్క నేతను కూడా పార్టీలోకి తీసుకు వచ్చే ప్రయత్నంచేయలేదని పవన్ కల్యాణ్ గుర్తించినట్లు కనిపిస్తుంది. జనసేన ఎప్పుడూ ఇలాగే ఉంటే ఇక ఎదిగే అవకాశం లేదని భావించిన పవన్ కల్యాణ్ కొంత పార్టీలో దిద్దుబాటు చర్యలకు దిగారనిపిస్తోంది. వైసీపీ నుంచి వచ్చిన నేతలయినా అక్కున చేర్చుకుంటే వారు నమ్మకంగా ఉండటమే కాకుండా ఇతర నేతలను కూడా తీసుకు వస్తారని, కానీ తొలి నుంచి తన వెంటే నడుస్తున్నా, మరొక నేతను పార్టీలోకి తీసుకు రాకపోవడంపై పవన్ కు అనుమానం కలిగినట్లుంది. పార్టీ ఇంకా బలోపేతం కావాలంటే చేరికలు అవసరమని భావిస్తున్న పవన్ కల్యాణ్ తన ప్రయారిటీ ఇదీ అని ఇటు నేతలకు చెప్పకనే చెప్పారనిపిస్తుంది. మరి పవన్ కల్యాణ్ ఈ రకమైన చర్యలతోనైనా పార్టీ బలోపేతం అవుతుందా? లేదా? అన్నది చూడాలి.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140